# కల చెదిరిన వేళ...

"నమస్కారం, ఫోన్‌లో నేను చేసిన అభ్యర్ధనని మన్నించి నన్ను కల్సుకోడానికి యిక్కడకొచ్చినందుకు కృతజ్ఞురాల్ని."

"దానికేంలెండి! ఎంతో ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాలన్న ఉద్దేశ్యంతోనే ఇలా ఏకాంత ప్రదేశంలో సాయంత్రం కలవమని వుంటారని గ్రహించి వొచ్చేను."

"నా పేరు చెప్పగానే నన్ను గుర్తు పట్టేరా?"

"ఒక్క క్షణం ఆలోచించాల్సివొచ్చింది. ఈలోగా మీ అక్కయ్యగారి పేరు చెప్పి, నిన్నటి పెళ్లి చూపుల తతంగాన్ని ప్రస్తావించగానే వెంటనే గుర్తుపట్టేను. ఏమిటి సంగతి చెప్పండి."

"మీరు అండి అండి అని మన్నించక్కర్లేదు. అన్ని విధాలా మీరు నాకంటే పెద్ద వారు. నేను మన్నించడం సభ్యతకాని...."

"మనకున్న కొద్ది పాటి పరిచయం దృష్ట్యా అటువంటి సభ్యత పాటించడం నాకూ అవసరమే."

"నిన్న పెళ్లి చూపులయింతర్వాత మీ అమ్మగారు మా అమ్మతో ఏం చెప్పారో తెలుసా?"

"తెలుసు - అసలు పెళ్లి చూపులెలా జరిగాయో ఆలోచించండి. మీ తల్లి తండ్రులకీ మా అమ్మకీ, మధ్యవర్తుల ద్వారా పరిచయమైంది. మా అమ్మని మీ యింటికి పిలుచుకెళ్లి మీ అక్కా చెల్లెళ్లనీ మీ నాన్నగార్ని మీ అమ్మగారు పరిచయం చేసేరు. మీ తల్లితండ్రులూ మా యింటి కొచ్చి నన్ను కల్సుకుని నా పెళ్లి ప్రస్తావన తెచ్చి మీ యింటికి రమ్మని ఆహ్వానించేరు. నేను తప్పకుండా వొచ్చి అమ్మాయిని చూస్తానని మాటిచ్చేను."

"అమ్మాయిని కాదు. ఇద్దరమ్మాయిల్నీ చూస్తానన్నారుటకదా!"

"నేననలేదు. ఆ ప్రతిపాదన మీ అమ్మగారి దగ్గిరున్నంచి వొచ్చింది. మా అమ్మ సంతోషంగా ఒప్పుకుంది. సహజమేకదా!"

"కారణం ఏమైవుంటుందో గ్రహించి వుంటారు. మా నాన్నగారోచిన్న ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తూ అతికష్టంమీద మాకు చదువులు చెప్పించేరు. మాకెలాంటి ఆస్తి పాస్తులు లేవు...."

"ఆ ప్రస్తావన మళ్లీ అనవసరం. నాకు పిల్ల నచ్చితే, ఆ పిల్లకినేను నచ్చితే పెళ్లి విషయంలో మీకు తలకు మించిన ఖర్చు భారం వుండదనీ, కట్నాలు లాంఛనాలూ లాంటి పసలు వుండవనీ నేనూ చెప్పేను, మా అమ్మా చెప్పి వుంటుంది."

"అందుకే ఎలాగైనా మీతో సంబంధం కలుపుకునే అవకాశాన్ని జార విడవకూడదన్న ఉద్దేశ్యంతో, మా అమ్మ ఆ ప్రతిపాదన చేసి వుంటుంది."

"కావచ్చు. నేను మీ యింటికొచ్చినప్పుడు మీ అక్కయ్యగారిని చూసుకోడానికే వొచ్చేను. చూసేను. ఏం చేస్తున్నారని అడిగేను. యమ్మే బియిడి చేసి దగ్గర్లోనే వున్న కాన్వెంట్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్టు చెప్పేరు."

"మా అక్కయ్యేమీ అడగలేదా?"

"మీకు చెప్పే వుంటారు. బహుశా మీరిద్దరూ కూడబలుక్కున్నారేమో! ఇటు వంటి క్వాలిఫికేషన్సూ, ఇంతమంచి ఉద్యోగం, పైగా కట్నాలూ కానుకలు తీసుకోకూడదన్న ఆశయం వున్న నాకు ఇరవై తొమ్మిదేళ్లొచ్చినా నాకు నచ్చిన పిల్ల దొరకలేదా అని అడిగేరు."

"నిజంగానే మా యిద్దరికీ ఆ సందేహం వొచ్చింది. మీరు చెప్పిన కారణాలు సబబుగానే వున్నాయి. ఉద్యోగరీత్యా ట్రెయినింగ్‌కి విదేశాలకి వెళ్లి నిరుడే తిరిగి వొచ్చేనన్నారు. ఈ వూర్లోనే వున్న అమ్మాయి కావాలన్నారు. అమ్మాయికి అందచందాలు చదువుతో బాటు ఉద్యోగం వుండాలి, ఆ అమ్మాయి ట్రాన్స్‌ఫరనీ, ప్రొమోషననీ మరో వూరు వెళ్లక్కర్లేకుండా ఇక్కడే స్థిరంగా మీ అమ్మగారికి తోడుగా వుండాలని మీ అభిమతం. ఆ అన్వేషణలో ఆలస్యమైందన్నారు."

"అది గొంతెమ్మ కోరిక కాదనుకుంటాను."

"ఎంతమాట! అది మీ తల్లిగారిపట్ల మీకు వున్న గౌరవాభిమానాలకీ నైతిక బాధ్యతకీ నిదర్శనం."

"తల్లీ తండ్రీ తనే అయ్యి మా అమ్మ నన్ను పెంచింది. నాకెలాంటి అమ్మాయి భార్యగా రావాలో మా అమ్మకి తెల్సుననీ, అంచేత నాకు నచ్చడంతోబాటు ఆమెకి కూడా నచ్చిన అమ్మాయిని చేసుకోవాలని నా వుద్దేశ్యం."

"మరి మా అక్కయ్యని చూశారు. మాట్లాడేరు. మరి ఏం నిర్ణయించుకున్నారు?"

"మరి నేను మా అమ్మతో సంప్రదించి నా నిర్ణయం చెప్పే అవకాశం ఏదీ! ఇంతలోకే ఉండుబాబూ మా రెండో అమ్మాయిని పరిచయం చేస్తానంటూ మీ అమ్మగారు లోపలికెళ్లి మిమ్మల్ని తీసుకొచ్చేరు. మీరు మీ అక్కయ్య కూర్చున్న ప్రక్క కుర్చీలో కూర్చున్నారు."

"అసలు నేను రాకూడదనుకున్నాను. కాని మా తల్లితండ్రుల మాట కాదనలేక వొచ్చేను. అటువంటి పరిస్థితుల్లో మా అక్కయ్య ఎంత చిన్న బుచ్చుకుంటుందో, ఎంత ఆందోళన చెందుతుందో ఆలోచించేరా!"

"ఆలోచించడానికేముంది! అంతా ఓ పథకం ప్రకారమే జరిగింది. ఆమె చిన్న బుచ్చుకున్నట్టు కనబడలేదు. మీరు యమ్మెస్సీ పేసై కంప్యూటర్ కోర్స్ పూర్తిచేసి ఓ పెద్ద కంపెనీలో పెద్ద జీతం తెచ్చుకుంటున్నట్టూ, సంగీతంలో మీ అభిరుచి ప్రావీణ్యం వివరించి, చిరునవ్వుతో మీ అక్కయ్యగారే మిమ్మల్నినాకు పరిచయం చేసేరు."

"మా ఆర్థిక పరిస్థితి, పెళ్లికొడుకుల కోరికలు, షరతులు దృష్టిలో వుంచుకుని ఇంత మంచి సంబంధం చెయ్యి జారిపోకుండా, పోనీ పెద్దమ్మాయి నచ్చకపోతే రెండోది నచ్చినా ఒ[illegible]కుందామన్న ఉద్దేశ్యంతో నన్ను కూర్చోపెట్టేరు."

"అవును. అదే వుద్దేశ్యంతో మా అమ్మా మీ వాళ్ల అభ్యర్థనని గౌరవించింది."

"చివరకు మేము భయపడ్డట్టే మీ అమ్మగారు వెడుతూ వెడుతూ మా అమ్మతో మీ రెండో అమ్మాయిని మావాడు యిష్టపడితే మీకభ్యంతరం లేదుకదా" అన్నారుట.

"ఆ స్వాతంత్ర్యం మా అమ్మకి మీరే యిచ్చేరు. దాన్ని మా అమ్మ సద్వినియోగం చేసుకుంది."

"మాట వరసకి మీకో తమ్ముడున్నాడనుకోండి. అతన్ని వెంటబెట్టుకుని, అన్ని విధాలా యోగ్యురాలైన ఓ అమ్మాయిని చూసుకోడానికి మీరు వెళ్లేరనుకోండి. ఆ అమ్మాయికి మీ తమ్ముడు నచ్చినట్టయితే అతన్ని చేసుకోడానికి మీ కభ్యంతరం లేదు కదా అని వాళ్లడిగితే...."

"అలా ఎన్నుకునే స్వాతంత్ర్యం మేము ముందుగా యిచ్చినట్లయితే, ఆ అమ్మాయి మా తమ్ముడికి నచ్చినట్లయితే తప్పకుండా చేసుకోమని సంతోషంగా మా తమ్ముణ్ణి ప్రోత్సహిస్తాను."

"అలాంటి పరిస్థితుల్లో మీ తమ్ముడు ఆమెని చేసుకోడానికి ఒప్పుగోడం సంస్కారానికివిరుద్ధం కాదంటారా!"

"మాటవరసకి మనం యిద్దరం ప్రేమించుకున్న జంట అనుకోండి. అప్పుడు మీ అక్కయ్యని గురించి ఆలోచిస్తారా! కాకపోతే మా అక్కయ్య పెళ్లయ్యావరకూ ఆగుదాం అంటారు. అంతే కదా!"

అవుననుకోండి. ఇది ప్రేమ వివాహం కాదు కదా! పాపం! మా అక్కయ్య ఈ సంబంధం గురించి ఎన్ని కలలుకందో! అవన్నీ చెదిరిపోడానికి నేనే కారణమౌతాను. అది ఎంత దురదృష్టకరమో ఆలోచించండి."

"ఆలోచించుకోవల్సింది మీరు. అసలు మీరు నన్నిక్కడికెందుకు రమ్మన్నారు? మీ అక్కయ్యగార్నిలాగ కించపరచడం దురదృష్టకరం కనక నాకు మీరు నచ్చినా, మీకు అంగీకారం కాదని చెప్పడానికొచ్చేరా?"

"ఇదేమైనా ఉద్యోగమా! సాహసించి సిఫార్స్ చెయ్యడానికి! మీ జీవిత భాగస్వామిని మీరెన్నుకునే స్వాతంత్రం మీకుంది."

"సరే. ఇంతకీ మీరు చెప్పదల్చుకున్నదేమిటి?"

"అదే సందిగ్ధంలో పడ్డానండి. నేనే మా అక్కయ్యయి వుండి, మా అక్కయ్యే నాకు చెల్లెలై వుంటే ఎగిరి గంతేసేదాన్ని."

"అలా అయ్యివుంటే నేను నిర్మొహమాటంగా మీ చెల్లెల్నే చేసుకుంటానని చెప్పేవాణ్ణి. మా అమ్మా నేను కూడా ఎలాంటి అమ్మాయికోసం ఇన్నాళ్లుగా వెతుకుతున్నామో అలాంటి అమ్మాయే మీ అక్కయ్య. ఆ వినయం, ఆ సహనం, ఆ స్వార్థత్యాగం...."

** రచన, ఫిబ్రవరి 2000*